ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల జిల్లా వార్తలు
శనివారం 19 ఏప్రిల్ 2025



డీలర్ల భర్తీకి మోక్షమెప్పుడో..?

- జిల్లాలో ఖాళీగా 99 దుకాణాల రేషన్ డీలర్‌షిప్‌లు
- నిత్యావసర వస్తువుల పంపిణీలో తప్పని అవస్థలు
- మంజూరుకు నోచుకోని కొత్త దుకాణాలు

జగిత్యాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్‌దుకాణాల వ్యవస్థ అస్తవ్యస్తంగా సాగుతోంది. కొన్ని సంవత్సరాలుగా రేషన్‌డీలర్ల ఖాళీలు భర్తీ చేయకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనికి తోడు కొత్త రేషన్ దుకాణాల డిమాండ్, ప్రతిపాదనలకు సైతం మోక్షం లభించడం లేదు. ఫలితంగా ప్రతీనెల నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడంలో తిప్పలు తప్పడం లేదు. ఆయా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు పలు పర్యాయాలు సమస్యలను అధికారులు, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఫలితం కనిపించడం లేదు. కొత్తగా రేషన్‌షాపులను ప్రారంభించక పోవడంతో సుదూర ప్రాంతాలకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితిని నిరుపేదలు ఎదుర్కొంటున్నారు.

● జిల్లాలో పరిస్థితి ఇలా...

జిల్లా వ్యాప్తంగా ప్రతీ నెల 592 చౌక ధరల దుకాణాల ద్వారా ప్రభుత్వం బియ్యం పంపిణీ చేస్తోంది. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, మల్యాల ప్రాంతాల్లో గల పౌర సరఫరాల శాఖ గోదాములతో స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాముల నుంచి పలు రేషన్‌దుకాణాలకు బియ్యం రవాణా జరుగుతోంది. జిల్లాలో 3,07,127 వివిధ కార్డుదారులుండగా వీటిలో 8,82,187మంది కుటుంబ సభ్యులున్నారు. ఇందులో 2,92,460 ఆహారభద్రత కార్డులుండగా 8,44,755 మందికి సభ్యులుగా ఉన్నారు. అంత్యోదయ కార్డులు 14,532 ఉండగా ఇందులో 37,277 మంది కుటుంబ సభ్యులున్నారు. అన్నపూర్ణ కార్డులు 145 ఉండగా 155 మంది కుటుంబ సభ్యులున్నారు. ప్రతీ నెల 5,578 మెట్రిక్ టన్నుల బియ్యం వివిధ కార్డుదారులకు ప్రభుత్వం పంపిణీ చేస్తోంది.

● లబ్ధిదారుల ఇక్కట్లు..

జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో 99 రేషన్ దుకాణాల డీలర్ల ఖాళీలున్నాయి. ఇందులో జగిత్యాల రూరల్ మండలంలో 2, వెల్గటూరులో 2, సారంగపూర్‌లో 3, రాయికల్‌లో 10, బీర్పూర్‌లో 8, బుగ్గారంలో 2, ధర్మపురిలో 5, గొల్లపల్లిలో 2, ఇబ్రహీం పట్నంలో 4, జగిత్యాల అర్బన్‌లో 9, కథలాపూర్‌లో 2 రేషన్ డీలర్ల ఖాళీలున్నాయి. అదేవిదంగా కొడిమ్యాల మండలంలో 7, కోరుట్లలో 6, మల్లాపూర్‌లో 6, మల్యాలలో 6, మేడిపల్లిలో 6, భీమారంలో 4, మెట్‌పల్లిలో 7, పెగడపల్లిలో 5, ఎండపల్లిలో 3 రేషన్‌డీలర్ల ఖాళీలున్నాయి. జిల్లా వ్యాప్తంగా 592రేషన్ దుకాణాలుండగా 84దుకాణాల డీలర్‌షిప్‌లు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో 493 దుకాణాలకు రెగ్యులర్ డీలర్లున్నారు. ఖాళీలున్న ప్రాంతాల్లో సమీపంలోని రేషన్ డీలర్లను ఇన్‌చార్జీలుగా కొనసాగిస్తూ సరుకులు పంపిణీ చేయిస్తున్నారు.

● ఇన్‌చార్జీలతో ఇబ్బందులు..

జిల్లాలో పలు రేషన్ దుకాణాలను ఇన్‌చార్జి డీలర్లతో నడిపిస్తుండడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రతీ నెల కనీసం పక్షం రోజుల పాటు సరుకులు పంపిణీ చేయాల్సి ఉంటుంది. పలు ప్రాంతాల్లో ఒక్కో డీలరుకు రెండు, మూడు దుకాణాలు అప్పగించడంతో సరుకుల పంపిణీలో అవస్థలు ఏర్పడుతున్నాయి. సరుకుల పంపిణీకి సంబంధించిన స్పష్టమైన సమాచారం కార్డుదారులకు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. బయో మెట్రిక్ మిషన్లు సైతం పలు ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్య కారణంగా పనిచేయడం లేదు. సర్వర్ మొరాయిస్తుండడంతో ..

మిగతా 8లో







'అర్హులందరికీ లేబర్ కార్డులు ఇవ్వాలి'



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులైన వారికి లేబర్ కార్డులు ఇచ్చి వారిని ఆదుకోవాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్స్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కిరణ్, గౌరవ అధ్యక్షులు వెన్న మహేష్ అన్నారు. జగిత్యాలలో గృహనిర్మాణ వ్యవస్థ నానాటికీ దెబ్బతింటుందని, వీటిపై ఆధారపడ్డ కార్మికుల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 21, 22 తేదీల్లో రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో జరిగే 4వ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను శుక్రవారం ఏఐటీయూసీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు నాయకులు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ బయటి రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికుల వల్ల స్థానిక లేబర్‌లకు ఉపాధి దెబ్బతింటుందన్నారు. స్థానిక కార్మికులకు నిర్మాణ రంగంలో పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టౌన్ కార్యదర్శి శివ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి రామిళ్ల బాబు, కోశాధికారి మల్లేశం, రంజిత్, ప్రశాంత్, ప్రతాప్‌సింగ్, నాగరాజు తదితరులున్నారు.

పోలీసుల తనిఖీలు

జగిత్యాల క్రైం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా కేంద్రంలో గురువారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు టౌన్ సీఐ వేణు గోపాల్ ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహిచారు. పట్టణంలోని పాత, కొత్త బస్టాండ్‌లతో పాటు టవర్ తదితర చౌరస్తాల్లో డాగ్ స్క్వాడ్‌తో పోలీసులు పలు వాహనాలను తనిఖీ చేపటి, అనుమానిత వ్యక్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ వేణు గోపాల్, ఎస్సైలు గీత, మన్మధ రావు, కిరణ్ కుమార్ ఉన్నారు.

నేడు జాబ్ మేళా

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): జగిత్యాలలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్లేస్‌మెంట్ సెల్ మరియు శాన్ బిజినెస్ సొల్యూషన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11గంటలకు క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. కొంగర్‌కలాన్ హైదరాబాద్‌లో గల ఐఫోన్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ కంపెనీలో ఆపరేటర్ ఉద్యోగం కోసం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు, ప్రస్తుత తృతీయ సంవత్సర విద్యార్థులు అర్హులని తెలిపారు. నెలకు రూ.15,625 జీతంతో పాటు, ఉచిత భోజనం, ప్రయాణ సౌకర్యం కల్పించబడునని, రిటైర్డ్ బెనిఫిట్స్‌గా ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్ఐ సౌకర్యం ఉందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆధార్‌కార్డు, ధ్రువ పత్రాలతో కాలేజీలో జరిగే డ్రైవ్‌కు హాజరుకావాలని రామకృష్ణ కోరారు.

పోస్టర్ ఆవిష్కరణ

గొల్లపల్లి ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి)18: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగల్‌లో తలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ నాయకులు పెద్ద ఎత్తున తరలి రావాలని గొల్లపల్లి మండల కేంద్రంలో సభ పోస్టర్‌ను మాజీ వైస్ ఎంపీపీ ఆవుల సత్యం మరియు బీఆర్ఎస్ నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి పట్టణ బీఆర్ఎస్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన



గోదాంను ప్రారంభిస్తున్న విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

వెల్గటూర్ ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన నూతన సంఘ భవనం మరియు గోదాం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా విప్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో ఎక్కడా ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. తాలు తప్ప పేరిట ఎటువంటి కటింగ్ లేకుండా చూడాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో పూర్తిగా కలెక్టర్ పర్యవేక్షణలో వడ్ల కొనుగోళ్లు కొనసాగించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పోనుగోటి శ్రీనివాస్, వెల్గటూర్ పీఏసీఎస్ చైర్మన్ గోలి రత్నాకర్, ఎండపల్లి పీఏసీఎస్ చైర్మన్ గూడ రాంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ గుండాటి గోపిక జితేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్ రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ మద్దుల గోపాల్ రెడ్డి, పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

● పెగడపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని పెగడపల్లి సింగిల్‌విండో పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, రాజారాంపల్లిలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన , రాములపల్లిలో నంచర్ల సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం విప్ లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంబించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ కేంద్రాలలో తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వరుస క్రమంలో తూకం వేస్తూ , వెంట వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సన్న ధాన్యానికి రూ. 500 బోనస్ ఇస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు కనీస వసతులు కల్పించాలని సూచించారు. కార్యక్రమాలలో తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ రాములు గౌడ్, సింగిల్‌విండో చైర్మన్ వేణు గోపాల్, సీఈవోలు గోపాల్ రెడ్డి, మధూకర్, ఏపీఎం సమత, పార్టీ నాయకులు ఒరుగల శ్రీనివాస్, సంధి మల్లారెడ్డి, శోభారాణి, అమిరిశెట్టి లక్ష్మీనారాయణ, కడారి తిరుపతి, చెట్ల కిషన్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు గర్హనీయం'



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షాపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఏకవచనంతో సంబోధించడం గర్హనీయమని జిల్లా బీజేపీ బాధ్యులు మర్రిపెల్లి సత్యం, రాగిల్ల సత్యనారాయణలు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బ్రిటీష్ వాళ్లకే భయపడలేదని, బీజేపీకి భయపడే ప్రసక్తేలేదని దయాకర్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదం అన్నారు. కాంగ్రెస్ పార్టీని స్థాపించిన ఏవో హ్యూమ్‌కూడా ఒక బ్రిటీష్ అధికారియేనని ఆయన గుర్తుంచుకోవాలన్నారు. గుజరాత్‌లో జరిగిన ఏఐసీసీ సమావేశంలో బీజేపీని ఓడిస్తాం అనగానే సోనియా, రాహుల్‌గాంధీలపై ఈడీ కేసులు నమోదు చేస్తుందని, దాడులు చేస్తుందని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. గతంలోనే సుబ్రహ్మణ్యస్వామి నేషనల్ హెరాల్డ్ కేసులో మనీ లాండరింగ్ కేసు వేశారన్నారు. అప్పటి నుంచే విచారణ సాగుతూ ఈ విచారణలో భాగంగానే ఈడీ సోనియా, రాహుల్‌పై ఛార్జ్‌షీట్ ఫైల్ చేసిందన్నారు.

రాజ్యాంగ బద్ధమైన సంస్థ అయిన ఈడీ కేసు విచారించి, ఛార్జ్‌షీట్ ఫైల్ చేస్తే అది మోదీకి, అమిత్‌షాకు సంబంధం ఎలా ఉంటుందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎలాంటి తప్పు లేకపోతే కోర్టులో తమ సచ్ఛీలతను చాటుకోవాలని హితవుపలికారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లడం మోదీ, బీజేపీకి పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా కోశాధికారి దశరథరెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు భైరి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.


బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

రాయికల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని జగిత్యాల జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్ అన్నారు. రాయికల్ పట్టణంలో శుక్రవారం రాయికల్ పట్టణ, మండల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈసందర్బంగా ఆమె మాట్లాడుత బీఆర్ఎస్ పుట్టి 24 ఏళ్లు పూర్తి చేసుకుని 25వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్బంగా పార్టీ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు ఏప్రిల్ 27న నిర్వహించే పార్టీ రజతోత్సవ సభకు తరలివచ్చి విజయవంతం చేయాలని అన్నారు. గ్రామ గ్రామాన పార్టీ జెండాలు ఎగురవేసి సన్నాహక సమావేశానికి బయలుదేరాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అనిల్, మండల అధ్యక్షుడు మల్లేష్, కో ఆర్డినేటర్ శ్రీధర్, మాజీ ఏఎంసీ చైర్మన్లు రాణి, సాయి, ఉదయశ్రీ, మండల ప్రధాన కార్యదర్శి రత్నాకర్ రావు, మండల మహిళా అధ్యక్షురాలు స్పందన, నాయకులు, మాజీ కౌన్సిలర్లు సత్యనారాయణ, రాజేష్‌గౌడ్, సాయి కుమార్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం

- తడిసిన ధాన్యం
- నేల రాలిన మామిడి
- లేచిన ఇంటి పైకప్పులు

6



కోరుట్ల మండలం మాదాపూర్‌లో నేలరాలిన మామిడి

నేడు భూ భారతిపై అవగాహన సదస్సు

భీమారం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): భీమారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు భూ భారతిపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రవికిరణ్ తెలిపారు. నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహణ కల్పించాలన్న రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలమేరకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతితిగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ హాజరు కానున్నట్లు తెలిపారు.

కుంకుమ పూజలు

జగిత్యాల క్రైం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని చింతకుంట చెరువు సమీపంలో ఉన్న ధన్వంతరీ దేవాలయంలో భక్తులు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం సూర్య భగవాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. నిర్వాహకులు, భక్తులు ఉన్నారు.

'ఆంధ్రజ్యోతి' కార్, బైక్ రేస్ విజేతకు బహుమతి అందజేత



'ఆంధ్రజ్యోతి' కార్,బైక్ రేస్ ప్రథమ బహుమతి విజేత పెద్దపల్లి ఎన్టీపీసీకి చెందిన దేవునూరి శ్వేత, శ్రీహర్ష దంపతులకు బైక్ ను అందజేస్తున్న కరీంనగర్ బ్రాంచి మేనేజర్ కల్లెపు సంపత్ రెడ్డి, డిప్యూటీ సర్క్యులేషన్ మేనేజర్ పాపారావు, డిప్యూటీ మేనేజర్ (అడ్వర్టయిజ్‌మెంట్) శ్రావణ్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొడిమ్యాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల మండలంలోని పూడూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ ఆర్.మహేందర్ తెలిపారు. పూడూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా సబ్‌స్టేషన్ పరిధిలోని పూడూర్, ఆరెపల్లి, అప్పారావుపేట, చెప్యాల, నాచుపల్లి, గౌరాపూర్, నర్సింహులపలి గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏడీఈ తెలిపారు. ఎక్స్‌ప్రెస్ ఫీడర్‌కు సరఫరా నిలిపి వేయబడుతుందని తెలిపారు.

●మల్యాల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మల్యాల మండలంలోని రాంపూర్, తాటిపల్లి సబ్‌స్టేషన్లలో మరమ్మతుల దృష్ట్యా ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈలు ఒక ప్రకటనలో తెలిపారు. రాంపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని రాంపూర్, ఒడ్డెర కాలనీ, ఓబులాపూర్ గ్రామాలకు ఉదయం 8నుంచి 11 గంటలవరకు, తాటిపల్లి, లంబాడిపల్లికు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు.

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



భూషణరావుపేటలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

జగిత్యాల క్రైం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పలు చర్చిల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తుల రాకతో చర్చిలు కిట కిటలాడాయి. భక్తుల కోసం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక గీతాలు ఆలపించారు. పాపులను రక్షించడం కోసమే యేసు క్రీస్తు సిలువపై ప్రాణ త్యాగం చేశారని ఆయా చర్చిల ఫాదర్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్‌కు చెందిన స్పీకర్ డాక్టర్ సందీప్ భార్గవ్, ఫాస్టర్ అబ్రహం, నిర్వాహకులు మోహన్ రావు, రవి, సామేల్ తదితరులు ఉన్నారు.

●బీర్‌పూర్: బీర్‌పూర్ మండలంలోని మంగేళ, కొల్వాయి, నర్సింహులపల్లి, ఇందిరానగర్, బీర్‌పూర్ గ్రామాలలోని పలు చర్చిల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చర్చి ఫాదర్లు పౌలు, జోషఫ్, రవి, ఇస్సాక్, క్రైస్తవ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

●కథలాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కథలాపూర్, భూషణరావుపేట, తాండ్ర్యాల, బొమ్మెన చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన క్రైస్తవులతో చర్చిలు కిటకిటలాడాయి. ఈ కార్యక్రమాల్లో పాస్టర్లు మిట్టపల్లి కిషన్, సామ్యుల్, ఏకోబు, గాంధారి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

మెట్‌పల్లిటౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివ భక్త మార్కండేయ ఆలయ పునఃనిర్మాణానికి పట్టణానికి చెందిన వ్యాపారవేత్త ఆడెపు శివ కుమార్-రమ దంపతులు 1.55 లక్షల విరాళాన్ని శుక్రవారం పద్మశాలి సంఘం సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు ద్యావనపల్లి రాజారాం పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో పట్టపగలే చోరీ..

● సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ ఎత్తుకెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు

హుజూరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని మార్కండేయ కిరాణం షాపులో శుక్రవారం పట్టపగలే గుర్తుతెలియని వ్యక్తులు సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ ఎత్తుకెళ్లారు. సదరు గుర్తుతెలియని వ్యక్తులు కిరాణం సామగ్రి కోసం షాపునకు వచ్చారు. షాపు యజమాని లోపలికి వెళ్లి సామగ్రి ఇస్తుండగా, కౌంటర్‌పై ఉన్న సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌ను దొంగలించారు. ఇది గమనించిన షాపు యజమాని మార్కెండేయ పోలీసులకు సమాచారం అందించగా, సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. 15రోజుల క్రితమే హుజూరాబాద్ పట్టణంలోని రెండుషెటర్లను పగలగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. అది మరవక ముందే మరోదొంగతనం జరగడంతో పట్టణప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● ముగురికి గాయాలు

మానకొండూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-వరంగల్ ప్రధానరహదారిపై మానకొండూర్‌లో శుక్రవారం లారీని ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. సూర్యాపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు(టీఎస్ 29 టిబి 3876)లో కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వైపు వెళ్తోంది. బస్సు ముందు ఉన్న గ్రానైట్ లారీ(టీఎస్ 02 యుబి 8907) సడన్ బ్రేకు వేశాడు. దీంతో లారీ వెనకాలే వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో అందులో ప్రయాణిస్తున్న వరంగల్ జిల్లాకు చెందిన మణికంఠ, రజిత, భారతికి గాయాలు అయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రెండు వాహనాలను పోలీసుస్టేషన్‌కు తరలించారు.

మినీ వ్యాన్, ఆటో ఢీ..

● నలుగురికి గాయాలు



నుజ్జు నుజ్జు అయిన ఆటో

కోనరావుపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం నిజామాబాద్ ఎల్లమ్మ ఆలయ ఆవరణలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలు అయ్యాయి. కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్ ఆటోలో గ్యాస్‌సిలిండర్లను డెలివరీ చేయడానికి వెళుతున్నాడు. కొలనూరు గ్రామానికి చెందిన శిల్ప, లాస్య, సుదర్శన్ ముగ్గురు టాటా ఏసీలో కోనరావుపేటకు వస్తున్నక్రమంలో నిజామాబాద్ ఎల్లమ్మ ఆలయ ఆవరణలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొట్టాయి. దీంతో ఆటో డ్రైవర్ శ్రీనివాస్, శిల్ప,లాస్య, సుదర్శన్‌కు తీవ్ర గాయాలుకాగా, సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కోనరావుపేట ఎస్‌ఐ ప్రశాంత్‌రెడ్డి కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఔషధ మొక్కలకు జీవం

ఆర్జీ-3లో 42 రకాల ఔషధ మొక్కలతో నర్సరీ ఏర్పాటు



నర్సరీలోని ఔషధ మొక్కలు

రామగిరి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఔషధ మొక్కలకు జీవం పోసేందుకు సింగరేణి యాజమాన్యం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా తొలిసారిగా ఆర్జీ-3 డివిజన్ పరిధి సెంటినరీకాలనీలోని ఔషధ మొక్కల నర్సరీని పబ్లిక్ పార్కుకు ఎదురుగా ఏర్పాటు చేసింది. విశాలమైన స్థలంలో ఔషధ మొక్కలను ఏర్పాటు చేసి సంరక్షణ చర్యలు చేపడుతోంది. సదరు కేంద్రంలో 42 రకాల వివిధ ఔషధ మొక్కల పెంపకం చేపడుతోంది. తొలి అడుగుగా సుమారు అరఎకరంలో ఔషధ మొక్కల నర్సరీని సింగరేణి ఫారెస్ట్ విభాగం ఏర్పాటు చేసింది. ప్రత్యేకంగా మొక్కల పెరుగుదల కోసం సేంద్రియ ఎరువులను వినియోగించి ఔషధ మొక్కలను సంరక్షణ బాధ్యతలను తీసుకుంది. అన్ని రకాల దీర్ఘకాలిక జబ్బులకు ఉపయోగపడే ఔషధ గుణాలు కలిగిన మొక్కలను పెంపకం చేపట్టింది. ప్రస్తుతం నర్సరీలో వనమూలికలు సేకరించేందుకు వీలుగా మొక్కలు అందు బాటులోకి రావడం విశేషం. అందులో ప్రధానంగా క్యాన్సర్, ఆస్తమా, షుగర్, బీపీ లాంటి వ్యాధులను నయం చేసే మొక్కల పెంపకం చేపట్టింది. వ్యాధుల నివారణకు వినియోగించే మొక్కలపై స్థానికులకు అవగాహన కల్పించే విధంగా సింగరేణి యాజమాన్యం చర్యలు చేపడుతోంది.



ఆర్జీ-3 డివిజన్‌లో ఔషధ మొక్కల కేంద్రం

ఔషధ మొక్కలను అందిస్తాం
ఆర్జీ-3 ఫారెస్ట్ అధికారి: కల్యాణ్



ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీలో పర్యావరణ పరిరక్షణ చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగా ఔషధ మొక్కల నర్సరీని ఏర్పాటు చేశాం. ఇందులో దీర్ఘకాలిక వ్యాధుల నివారణ కోసం ఏర్పాటు చేసిన మొక్కలు లభ్యం అవుతాయి. ఆయుర్వేదం ఆదరణ కరువైన నేపథ్యంలో వాటి ప్రాధాన్యాన్ని పెంచే ప్రయత్నంలో భాగంగా డివిజన్‌లో తొలిసారిగా ఔషధ మొక్కల పెంపకాన్ని చేపట్టింది. మండలంలోని కేవీకే, పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఔషధ మొక్కల ఏర్పాటుకు ఆసక్తి కనబరిచారు. ఔషధ మొక్కలను అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. కార్మిక కుటుంబాలు ఆసక్తి కనబరిస్తే వారికి ఔషధ మొక్కలను అందించేందుకు సింగరేణి సుముఖంగా ఉంది.

అకాల వర్షం..అపార నష్టం

● తడిసిన ధాన్యం ● నేల రాలిన మామిడి ● ఎగిరిపోయిన ఇంటి పైకప్పులు



కోరుట్లలో నేల కొరిగిన నువ్వు చేను



కోరుట్లలో నేల రాలిన మామిడి కాయలు



మెట్‌పల్లి మండలం ఎర్దండిలో కూలిన గుడిసె వద్ద కుటుంబ సభ్యులు

కోరుట్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కోరుట్ల, మెట్‌పల్లి, భీమారం, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, కథలాపూర్ తదతర మండలాల్లో శుక్రవారం అకాల వర్షం కురిసింది. దీంతో మామిడి నేల రాలింది. కోతకు వచ్చిన వరి నేల వాలింది. నువ్వు పంట నేలవాలి రైతులు లబోదిబోమన్నారు. కోరుట్ల మండలంలోని మాదాపూర్, పైడిమడుగు, చిన్నమెట్‌పల్లి, పైడిమడుగు, సర్పరాజుపూర్, అయిలాపూర్, కల్లూర్ గ్రామాల్లో వర్షం కురిసింది. దీంతో మామిడి నేల రాలింది. కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం కొంత మేర తడవగా నువ్వు పంట నేలకొరిగింది. మామిడి నేల రాలడంతో రైతులుకు భారీ నష్టం వాటిల్లింది. గాలి బీభత్సంతో మాదాపూర్ గ్రామ శివారులోని రాయికల్-కోరుట్ల రోడ్డుకు ఆనుకొని ఉన్న తాటి చెట్టు విరిగి విద్యుత్ తీగలపై వాలింది. దీంతో ప్రయాణికులు, వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడగా విద్యుత్ శాఖ అధికారులు మరమ్మత్తులు చేసి సరఫరాను పునరుద్ధరిచారు.

●మెట్‌పల్లిటౌన్: మెట్‌పల్లి పట్టణంలో శుక్రవారం గాలివానతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇబ్రహీంపట్నం మండలకేంద్రంతోపాటు ఆయాగ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిచింది. ఎర్దండి గ్రామ శివారులోని ఒడ్డెర కాలనీలో నివాసం ఉంటున్న గుడిసెలు తీవ్రగాలులతో లేచిపోయాయి. దీంతో అందులో నివాసం ఉంటున్న కుటుంబాలు ఆశ్రయం లేక రోడ్డున పడ్డాయి.

●భీమారం: భీమారం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. పలు చోట్ల చెట్లు విరిగి పడ్డాయి. భీమారం మండల కేంద్రానికి చెందిన నల్ల పోచయ్య ఇంటి పైకప్పు లేచిపోగా, భూదేవికి చెందిన ఇల్లు కూలిపోయింది. కొనుగోలు కేంద్రంలో ఆరబెట్టిన ధాన్యం తడిసిముద్దయింది. మండలంలోని వడ్లకొండ విశ్వంభర్, పెద్దిరెడ్డి స్వామి రెడ్డి, అడువాల రాజేశం తదితర రైతులకు చెందిన మామిడి తోటల్లో మామిడి కాయలు రాలాయి.

●కథలాపూర్: మండలకేంద్రంలో శుక్రవారం సాయంత్రం వీచిన భారీ ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలపై చెట్లు విరిగి పడ్డ ఘటనలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో షార్ట్ సర్క్యూట్ సంభవించింది. దీంతో ఐస్ లైన్డ్ రిఫ్రిజిరేటర్ (ఐఎల్ఆర్), రెండు డీప్ ఫ్రీజర్లు, వ్యాక్సిన్ క్యారియర్ బాక్స్‌లు కాలిపోయాయి. గదిలో ఉన్న ఫర్నిచర్ కాలి బూడిదయిందని ఈ ప్రమాదంలో రూ.25 లక్షల ఆస్తినష్టం సంభవించిందని హెచ్‌ఈఓ శ్రీధర్ తెలిపారు. మండలంలోని పలుగ్రామాల్లో ఈదురు గాలులకు మామిడి కాయలు రాలిపోగా, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిచిపోయింది.

● కోరుట్ల: కోరుట్ల పట్టణంలో శుక్రవారం గాలి వాన బీభత్సం సృష్టించింది. పట్టణంలోని రాంనగర్, బీలాల్‌పుర, అల్లమయ్య గుట్ట ప్రాంతాల్లో సాంకేతిక లోపంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

●ముస్తాబాద్: మండలంలో శుక్రవారం సాయంత్రం కురిసిన వడగళ్ల వాన రైతులకు కన్నీరు మిగిల్చింది. ముస్తాబాద్‌తోపాటు మద్దికుంట, చీకోడ్ గ్రామాల్లో భారీగా పంటనష్టం జరిగింది. వర్షంతోపాటు ఈదురు గాలులతో వరిగింజలు, మామిడి కాయలు రాలిపోయాయి. ముస్తాబాద్‌కు చెందిన ఎలుసాని దేవయ్య అనే రైతుకు చెందిన దాదాపు అయిదు ఎకరాల వరిపంట పూర్తి స్థాయిలో నెలమట్టమయింది. కొనుగోలు సెంటర్లలో ధాన్యం తడిసిపోయింది. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో పంట నష్టం జరిగింది. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీఎంపీపీ జనగామ శరత్‌రావు కోరారు. బాధిత రైతులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, నాయకులు పరామర్శించారు.

● గంభీరావుపేట: గంభీరావుపేట మండలంలో శుక్రవారం కురిసిన ఈదురుగాలులతో కూడిన రాళ్లవాన వరి పంటలకు అపారనష్టం వాటిల్లింది. ఈదురుగాలులకు కోతలకు వచ్చిన వరిచేలు నేలపాలయ్యాయి. కోసి కుప్పలు పోసిన వరిధాన్యం వర్షానికి తడిసిపోయింది. ప్రధానంగా కొత్తపల్లి, ముచ్చర్ల గ్రామాల్లో రాళ్లవానతో వరిపంటలకు తీవ్రనష్టం వాటిల్లినట్టు రైతులు తెలిపారు. కొత్తపల్లికి చెందిన బాలయ్య, మహేష్, శంకర్, దేవేందర్, సంజీవం తదితర రైతుల పంటలకు అపార నష్టం వాటిల్లింది. ముచ్చర్లలో జీవన్, కిషన్, మల్లయ్య, ఎల్లయ్య, వెంకటస్వామి, దేవయ్య, తదితర రైతులకు చెందిన కోతకు వచ్చిన వరి రాళ్ల వానతో నష్టం కాగా, భిక్షపతి, కనకయ్య, రవీందర్‌రెడ్డి, దుర్గయ్య, నర్సయ్య, రమేష్ తదితర రైతుల కోతలు కోసి కళ్లాల వద్ద ఉంచిన ధాన్యం తడిసిపోయింది. నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించాలని రైతులు కోరారు. ఇదిలా ఉండగా రాజుపేటలో వర్షానికి ధాన్యం తడిసిపోయింది. నర్మాలలో ఈదురు గాలులకు రోడ్డుకు అడ్డంగా చెట్టు విరిగిపడగా, ముచ్చర్ల నుంచి పోతారం వెళ్లే దారిలో కూడా ఈదురు గాలులకు చెట్టు విరిగిపడింది.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

● రాష్ట్ర వ్యాప్తంగా 85కేసులు నమోదు

● పీడీ యాక్ట్ కేసులో నాలుగు సంవత్సరాల జైలుశిక్ష

● జమ్మికుంటలో అదుపులోకి తీసుకున్న పోలీసులు



అంతర్‌జిల్లా దొంగను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

జమ్మికుంట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలో మూడు రోజుల క్రితం వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెలు తాడు ఎత్తుకెళ్లిన అంతర్‌జిల్లా దొంగను పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి శుక్రవారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ, పట్టణసీఐ వరంగంటి రవికుమార్ చోరీకి సంబంధించిన వివరాలు వెల్లడించారు. సిద్దిపేట జిల్లా వడ్డెరకాలనీకి చెందిన అల్లెపు కృష్ణ ఎక్కడకు వెళ్లిన తాను పంచాయతీ కార్యదర్శిని అని, పెన్షన్ ఇప్పిస్తానని చెప్పుకుంటూ అమాయకప్రజలను నమ్మిస్తూ వారి మెడలోని బంగారుగొలుసులు ఎత్తుకెళ్తుంటాడు. మూడు రోజులక్రితం జమ్మికుంటలోని కొండూర్‌కాంప్లెక్స్‌లో అల్లెపురెడ్డి కమలమ్మ-కొంరారెడ్డి వృద్ధ దపంతులను అదేవిధంగా నమ్మించి బురిడీ కొట్టించాడు. రూ.4వేల పెన్షన్ ఇప్పిస్తానని చెప్పి, మెడలోని రూ.80వేల విలువగల పుస్తెలతాడు ఎత్తుకెళ్లాడు. చోరీని సీరియస్‌గా తీసుకున్న పోలీస్‌లు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. మూడురోజుల వ్యవధిలో సదరు దొంగను వలపన్ని పట్టుకున్నారు. మళ్లీ చోరీ కోసం జమ్మికుంటకు వచ్చిన దొంగను గాంధీచౌరస్తాలో అదుపులోకి తీసుకున్నారు. అతడి దగ్గరి నుంచి జమ్మికుంట చోరీకి సంబంధించి రూ.80వేల విలువ గల పుస్తెలు తాడు, హైదరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చోరీకి సంబంధించి తులంన్నర బంగారం స్వాధీనం చేసుకున్నారు. అల్లెపుకృష్ణపై జమ్మికుంటలో మూడుకేసులు, హుజూరాబాద్‌లో మూడుకేసులు, కరీంనగర్‌లో 10కేసులు, రాష్ట్ర వ్యాప్తంగా 85కేసులు నమోదై ఉన్నాయి. రెండుసార్లు పీడీయాక్ట్ కేసుల్లో నాలుగేళ్ల జైలు శిక్ష అనుభవించాడు. అయిన అతడిలో ఎలాంటి మార్పు రాలేదు. అతడిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించి నట్లు పోలీసులు తెలిపారు. ఇలాంటి దొంగల పట్ల ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని ఏసీపీ సూచించారు. చాకచక్యంగా వ్యవహరించి దొంగను పట్టుకున్న పోలీస్ సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

గంగాధర, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండల ప్రధాన రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు. వారివివరాల ప్రకారం.. కోనరావుపేట మామిడిపల్లికి చెందిన ఐలయ్య ద్విచక్రవాహనంపై గంగాధర వస్తున్నాడు. గంగాధర నుంచి కరీంనగర్ వైపు వెళుతున్న కారు ఐలయ్య వాహనాన్ని ఢీకొట్టింది. ఈప్రమాదంలో కాలు, చేతులు విరిగిఐలయ్య తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108లో కరీంనగర్ తరలించగా ప్రస్తుతం ప్రవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ప్రమాదవిషయాన్ని స్థానికులుపోలీసులకుసమాచారం అందజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం శాయంపేట గ్రామానికిచెందిన మడికొండ శ్రీనివాస్ రావు (42) గడ్డిమందుతాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడి, చికిత్స పొందుతూ శుక్రవారం మృత్యువాతపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్‌రావు ఎనిమిది సంవత్సరాల క్రితం తనసొంత ట్రాక్టర్ నడుపుతుండగా యాక్సిడెంట్ చేయడంతో ఓవ్యక్తి మృతిచెందాడు. ఖర్చుల నిమిత్తం ట్రాక్టర్, భూమి అమ్మేశాడు. అప్పటి నుంచి మద్యానికి బానిసవడంతో ఆరోగ్యం క్షీణించింది. ఈనెల15న గడ్డి మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు వరంగల్ ఎంజీఎమ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్యలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గ్రావిటీ కెనాల్‌లో పడి యువకుడి గల్లంతు

రామడుగు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం గోపాలరావుపేట గ్రామానికి చెందిన పురాణం సాగర్(32) అనే యువకుడు గ్రావిటీకెనాల్‌లో పడి గల్లంతైనట్లు తెలిసింది.. కరీంనగర్-గోపాల్‌రావుపేట ప్రధానరహదారిలో గల రామడుగు రైతు వేదికవద్ద గ్రావిటీ కెనాల్‌లోసాగర్ శుక్రవారం రాత్రిపడ్డట్లు గ్రామస్థులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

జల్సాల కోసం చోరీలు

● పోలీసులకు చిక్కిన యువకులు



ముస్తాబాద్ ఠాణాలో దొంగల అరెస్టు చూపుతున్న సీఐ మొగిలి

ముస్తాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జల్సాల కోసం చోరీకి పాల్పడిన యువకులు పోలీసులకు దొరికి జైలుకు వెళ్లిన సంఘటన ముస్తాబాద్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. సీఐ మొగిలి తెలిపినవివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని శుభోదయ మండల సమాఖ్య నుంచి ఒక ఐచర్ ట్రాక్టర్, కుట్టు మిషన్‌ను గత ఫిబ్రవరిలో గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. సమాఖ్య అధ్యక్షురాలు అల్వాల దేవిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. వాటిని ఎత్తుకెళ్లిన దొంగల కాల్‌డాటా, సీఆర్ఆర్ డంప్స్ ఆధారంగా నిందితులను గుర్తించారు. పక్కా సమాచారం మేరకు కుట్టు మిషన్ ఎత్తుకెళ్లిన ముస్తాబాద్‌కు చెందిన మహ్మద్ షాదుల్లా, దావిరెడ్డి నరేందర్‌రెడ్డితోపాటు సిద్దిపేటకు చెందిన మహ్మద్ సమీర్‌ను అరెస్టు చేశారు. వారివద్ద ఉన్న రూ.6లక్షల ఐచర్ ట్రాక్టర్‌తోపాటు కుట్టు మిషన్‌ను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. అలాగే వారివద్ద ఉన్న మోటర్‌సైకిల్, ఇండికా కార్, మూడు సెల్‌ఫోన్‌లను సీజ్ చేసినట్లు తెలిపారు. సిద్దిపేట జిల్లా రావురూకుల గ్రామానికి చెందిన మల్లేశం పరారీలో ఉన్నట్లు వివరించారు. జల్సాలకు అలవాటుపడి దొంగతనాలు చేస్తున్నట్లు నిందితులు ఒప్పుకున్నట్లు తెలిపారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. దొంగలను పట్టుకున్న ఎస్‌ఐ సీహెచ్ గణేశ్, హెచ్‌సీలు బాల్‌నర్సయ్య, పీసీలు రాజశేఖర్, ఖాసీంలను సీఐ మొగిలి అభినందించారు.

చెరువులో పడి బాలుడి గల్లంతు



రాజేష్(ఫైల్)

మల్లాపూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో పశువుల కాపరికి సహాయకుడిగా వెళ్లిన పుట్ట రాజేష్(13) అనేబాలుడు చెరువులో పడి శుక్రవారం గల్లంతయ్యాడు. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన పుట్ట పోశెట్టి పశువులకాపరిగా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శుక్రవారం పోశెట్టికి ఇతర పనులు ఉండడంతో గ్రామానికి చెందిన ఓ వృద్ధుడిని పశువులు మేపడానికి పంపాడు. గుడ్ ఫ్రైడే సందర్భంగా పాఠశాలకు సెలవు కావడంతో పుట్ట రాజేష్ వృద్ధుడి వెంట సహాయకుడిగా గ్రామశివారులోకి వెళ్లాడు. సాయంత్రం పశువులను ఇంటికి తీసుకొస్తున్న క్రమంలో గ్రామ శివారులో ప్రమాదవశాత్తు పెద్దచెరువులో కాలుజారి పడి గల్లంతుయ్యాడు. చెరువులో గ్రామస్థులు వెతికినా ఆచూకీ లభించలేదు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

బారాత్‌లో తల్వార్‌తో హంగామా

● నిందితుడి అరెస్టు



నిందితుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జవారిపేట గ్రామానికి చెందిన గొరవేని శ్రీకాంత్ అనే యువకుడు తల్వార్‌తో బెదిరించడంతో అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. ఎక్స్‌కావేటర్ నడుపుకుంటూ జీవించే శ్రీకాంత్ ఈనెల16న జవారిపేటలో జరిగిన పెళ్లి బరాత్‌లో తల్వార్‌తో బెదిరింపులకు గురిచేయడమే కాకుండా అడ్డు చెప్పిన పోలీసుల విధులకు ఆటంకం కలిగించాడు. అనంతరం గ్రామం నుంచి వెళ్లిపోయాడు. శుక్రవారం తాళ్లపెల్లి సమీపంలో పట్టుబడినట్లు తెలిపారు. అతడు ప్రయాణిస్తున్న వాహనంలో సోదాచేయగా తల్వార్‌తో పాటు కత్తి లభించినట్లు తెలిపారు. శ్రీకాంత్‌ను విచారించగా డ్రైవర్‌గా వచ్చిన డబ్బులు సరిపోవడం లేదని ఆరు నెలల క్రితం గురుద్వార్ వెళ్లినప్పుడు తల్వార్, కత్తిని కొనుగోలు చేసి తీసుకవచ్చానని తెలిపాడు. ఇతడిపై ఇప్పటికే ఏడు కేసులు ఉన్నట్లు తెలిపారు. కానిస్టేబుల్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు నిండితుడిని అరెస్టు చేసి అతని నుంచి థార్ వాహనాన్ని, తల్వార్, కత్తిని సీజ్ చేసినట్లు తెలిపారు.

శాంతినగర్‌లో వ్యక్తి ఆత్మహత్య

జ్యోతినగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శాంతినగర్‌లో బండ మోహన్(35) గురువారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గోదావరిఖని సంతోష్‌నగర్‌కుచెందిన మోహన్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తున్నాడు. శాంతినగర్‌లో ఒక అద్దె ఇంట్లో కుటుంబంతో ఉంటున్నాడు. ఈక్రమంలో గురువారంరాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చిన మోహన్‌భార్యతో గొడవపడ్డాడు. తాగినమత్తులో భార్య, ఇద్దరుపిల్లలను కొట్టి తనగదిలోకివెళ్లి చున్నీతోసీలింగ్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడిఅన్న బండ రవి ఫిర్యాదు మేరకుకేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎన్టీపీసీ ఎస్‌ఐ ఉదయ్‌కిరణ్ తెలిపారు.

హైదరాబాద్ రోడ్డు ప్రమాదంలో బోర్నపల్లి వాసి మృతి

హుజూరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పరిధిలోని బోర్నపల్లి గ్రామానికి చెందిన యువకుడు శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాలప్రకారం.. బోర్నపల్లికి చెందిన కుతాడి జీవన్(23) హైదరాబాద్‌లో స్విగ్గీ డెలివరీ బాయ్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. వృత్తిలో భాగంగా డెలివరీ ఇవ్వ డానికి వెళ్తుండగా మణికొండ వద్ద కారు ఢీకొంది. అనంతరం లారీ కింద పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. జీవన్ మృతిచెందడంతో బోర్నపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విద్యార్థిని ప్రతిభ..

● చిత్రలేఖనం, సంగీతంలో రాణిస్తున్న విద్యార్థిని ● పలువురి ప్రశంసలు అందుకుంటున్న అర్చన



అర్చన గీసిన చిత్రాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఆ చిన్నారి పెన్సిల్ పట్టుకుంటే.. అందమైన చిత్రం కాగితంపై ఆవిష్కృతం అవుతుంది. సమయం దొరికినప్పుడల్లా కళకు జీవం పోస్తుంది. చిత్రలేఖనంతోపాటు సంగీతంలోనూ ప్రతిభ కనబరుస్తూ పలువురి ప్రశంసలందుకుంటోంది ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌కు చెందిన విద్యార్థిని రామ అర్చన.

చిన్నతనం నుంచే చిత్రలేఖనంపై ఆసక్తి..

మండలంలోని రాచర్లబొప్పాపూర్‌కు చెందిన రామ కృష్ణవేణి-దామోదర్ దంపతులకు ఇద్దరు కూతుళ్ల అర్చన, శ్రావ్యలు. పెద్ద కూతురు అర్చన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. చిన్నప్పటి నుంచే కాగితాలపై చిత్రాలు గీయడం అలవాటు చేసుకుంది. ఖాళీ సమయాల్లో చిత్రాలు గీస్తూ ప్రతిభను చాటుకుంటోంది. తల్లిదండ్రులు ఆమె ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడంతో మరింతా ముందుకు సాగుతోంది. రాధాకృష్ణులు, శివుడు, మహిళలు బతుకమ్మ ఆడడం తదితర చిత్రాలు అబ్బురపరుస్తున్నాయి.

సంగీతంలోనూ ప్రావీణ్యం..

చిత్రలేఖనంతో పాటు సంగీతంలోనూ అర్చన రాణిస్తోంది. దేశభక్తి, సినీ గేయాలు క్యాషియోపై వాయిస్తూ ఆశ్చర్యపరుస్తోంది. పాఠశాల వార్షికోత్సవంలో ప్రతిభను చాటుకుని పలువురి ప్రశంసలందుకుంది.



క్యాషియో వాయిస్తున్న అర్చన

మ్యూజిక్ డైరెక్టర్‌నవుతా..: విద్యార్థిని అర్చన

భవిష్యత్తులో ఆర్టిస్ట్‌తోపాటు మ్యూజిక్ డైరెక్టర్ కావాలనేది నా లక్ష్యం. నేను గీసిన చిత్రాలు ప్రదర్శనగా ఉంచి అందరి చేత ప్రశంసలు అందుకోవాలని నా కోరిక.



మామిడి, అల్లనేరేడు చెట్లకు చేసిన అలంకారం

మామిడి చెట్లకు కల్యాణం

● ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా శివ పార్వతుల కల్యాణం

కథలాపూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలోని గంభీర్‌పూర్‌లో శుక్రవారం ముదిరాజ్ సంఘ సభ్యులు తమ ఎనిమిది ఎకరాల మామిడి తోటకు వివాహం జరిపారు. తోటను సాగు చేసుకుని ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా శివుడు(అల్లనేరేడు), పార్వతి (మామిడి) చెట్లను శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. పండితులు మాధవాచార్యులు వేద మంత్రోచ్చరణల మధ్య సంఘ సభ్యులు కల్యాణం జరిపారు. ఐదేళ్లకు కాత వచ్చే దశ కావడం వల్ల అధిక దిగుబడి రావాలనే ఉద్దేశ్యంతో పెళ్లి జరిపించామని సంఘ సభ్యులు తెలిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో దాసరి గంగాధర్, గండి రవి, కొండగట్టు, గండి తిరుపతి, సంఘ సభ్యులు ఉన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న ముదిరాజ్ సంఘ సభ్యులు

యువకుడి అదృశ్యం



గణేష్ (ఫైల్)

గొల్లపల్లి ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపట్నం గ్రామానికి చెందిన చిట్యాల గణేష్ (19) గురువారం నుంచి కనిపించడం లేదని వారి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గొల్లపల్లి ఎస్సై తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు స్థానిక పోలీస్‌స్టేషన్, వారి కుటుంబ సభ్యులకు తెలపాలని కోరారు.



ఆచీతూచి అడుగు వేయాలి

ఇంటర్ తర్వాత కోర్సుల ఎంపికే కీలకం
మూడు, నాలుగేళ్లు కష్టపడితే జీవితం ఆనందమయం

గణేశ్‌నగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల ఫలితలు కొన్ని రోజుల్లో వెలువడనున్నాయి. తరువాత ఏం చదవాలి, ఏరంగంలో స్థిరపడాలనే సందేహాలు విద్యార్థుల మెదడులో మెదులుతూ ఉంటాయి. దీనికి తల్లిదండ్రుల ఒత్తిడి, వివిధ కళాశాల పీఆర్వోల హంగామా తోడైంది. ఇంటర్ తర్వత చదివే కోర్సులే జీవితాన్ని మలుపు తిప్పుతాయి. డాక్టర్, ఇంజనీరింగ్, శాస్త్రవేత, చార్టర్ అకౌంటెంట్, బ్యాంకు ఉద్యోగులు,వివిధ ప్రభుత్వకొలువులు ఇలా అనేక అవకాశాలు ఊరిస్తూ ఉంటాయి. దీంతో విద్యార్థి ఊగిసలాడుతూ ఉంటారు. నిర్దిష్ట ఆలోచన, విద్యార్థి అభిరుచి, అసక్తే ఇక్కడ కీలకం. విద్యార్థికి ఆసక్తి, అభిరుచి ఉన్న కోర్సు ఎంపిక చేసుకుంటేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుంది. ఇంటర్ విద్యార్థుల కోసం ప్రత్యేక కథనం..

● డీఎడ్ ప్రాథమిక బోధన..

ఉపాధ్యాయ వృత్తిపై మక్కువ ఉంటే రెండేళ్ల డీఎడ్ కోర్సులో చేరవచ్చు. జిల్లాలో ఇలాంటి కళాశాలలు ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో ఉన్నాయి. డీఎడ్ కామన్ ఎంట్రన్స్ పరీక్షతో సీటు లభిస్తుంది. అతి త్వరలోనే ఒక ప్రభుత్వ ప్రకటన వెలువడుతుంది.

● ఉపాధితోనూ సేవ చేయాలనుకుంటే...

బైపీసీ విద్యార్థులకు బీఎస్సీ నర్సింగ్ ఒక చక్కని అవకాశం. ఉపాధి పొందుతూ పేదలకు సేవ చేసేందుకు ఈ కోర్సు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇంటర్ తర్వాత నాలుగేళ్ల కోర్సును ఎంపిక చేసుకుంటే ఆపై వెంటనే ఉద్యోగం లభిస్తుంది. రెండేళ్ల ఫిజియో థెరఫీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

● సీఏతో ఉన్నత హోదా

దేశ ఆర్థిక వ్యవహారాల్లో పర్యవేక్షణ, నియంత్రికకు సీఏ కోర్సు దోహదపడుతుంది. ఇంటర్ తర్వాత సీపీటీ ప్రవేశ పరీక్ష ఉంటుంది. అర్హత సాధించి ఐపీసీసీలో చేరవచ్చు. నాలుగున్నరేళ్ల చదివితే సమాజంలో ఉన్నత హోదాలో కొనసాగే అవకాశం ఉంటుంది.

● ఇంజనీరింగ్..

ఎప్‌సెట్లో ఇంజనీరింగ్ కోర్సులకు ప్రాధాన్యం అధికం. ఇందులో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఇంజనీరింగ్ సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ ఎలక్ట్రికల్, ఐటీ, ఈఈఈ, వంటి కోర్సులు ఉన్నాయి. ఆసక్తి ఉంటే దేంట్లోనైనా రాణించే అవకాశం ఉంటుంది.

● వ్యవసాయం, ఉద్యానవనం

ఎప్‌సెట్‌తోనే బీఎస్సీ అగ్రికల్చర్, హార్టికల్చర్(బై పీసీ విద్యార్థులకు) చదివే అవకాశం ఉంటుంది. నాలుగేళ్ల బీఎస్సీ అగ్రికల్చర్ ఆపై పీజీ తరువాత పరిశోధన వైపు అడుగులు వేసే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ రంగాల్లో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

● న్యాయ వృత్తి...

ఇంటర్ తర్వాత ఐదేళ్ల న్యాయవిద్య కోర్సు ఉంది. లాసెట్‌తో ప్రవేశాలు జరుగుతాయి. స్థిరపడేందుకు ఎక్కువ సమయం తీసుకున్నా ఉపాధికి మాత్రం బాగుంటుంది. న్యాయవాదిగా వ్యాపార సంస్థలు న్యాయ సలహాదారులుగా రాణించవచ్చు.

● సాంప్రదాయ కోర్సులు

బీకాం జనరల్, కంప్యూటర్ కోర్సులకు డిమాండ్ ఉంది. బీఎస్సీలోనూ అనేక కాంపిటేషన్ కోర్సులున్నాయి. వీటిలో ఏదో ఒకటి ఎంచుకోవచ్చు.

● ఐఐటీతో సాంకేతిక విద్య

ఇంజనీరింగ్ విద్యపై ఆసక్తి ఉన్నత విద్యా సంస్థల్లో అభ్యసించాలనే వారికి ఐఐటీ ఎంతో ప్రయోజనకరం. ఇవి ఆఫర్ చేసే కోర్సుల్లో విద్యార్థులు వారి అభి రుచికి తగినవి ఎంచుకోవాలి.

● వైద్యమే ఆరాధ్యమైతే...


వైద్యవృత్తిపై ఆసక్తి ఉంటే ఎంబీబీఎస్ కోర్సు ఉత్తమం. నీట్‌లో వచ్చిన ర్యాంకు ఆధారంగా కళాశాలల్లో సీటు లభిస్తుంది. ఎంబీబీఎస్ పూర్తి చేసిన వారు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సివిల్ అసిస్టెంట్ సర్జన్, మెడికల్ ఆఫీసర్, వంటి ఉద్యోగాలు పొందవచ్చు. సొంతంగా ఆస్పత్రి ఏర్పాటు చేసుకోవచ్చు. ఎంబీబీఎస్‌లో సీటు రాకుంటే బీడీఎస్ చేరవచ్చు.

● ఫార్మసీకి ప్రాధాన్యం....

ఔషధరంగ పరిశోధన, అభివృద్ధి రంగాల్లో ఫార్మసీ విద్యార్థులకు అవకాశాలు విస్తృతంగా ఉంటున్నాయి. ఎంసెట్‌తోనే బీఫార్మసీ ప్రవేశాలు జరుగుతున్నాయి. ఇది పూర్తి చేసిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్, టెక్నికల్ ఆఫీసర్, ఆసుపత్రుల్లో ఫార్మాసిస్టులుగా ఉదోగ్యాలు లభిస్తాయి.

నచ్చిన కోర్సులు ఎంపిక చేసుకోండి

తల్లిదండ్రులు చెప్పారని, స్నేహితులు తీసుకున్నారని ఏ కోర్సులోనూ చేరవద్దు. మార్కెట్లో డిమాండ్ కంటే మనస్సు డిమాండ్‌కే అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ఆసక్తి ఉన్న కోర్సులో చేరితే జీవితంలో అత్యున్నత స్థాయికి చేరవచ్చు. పట్టుదల ఉంటేనే ఏ కోర్సులోనైనా రాణించవచ్చు. ఇంజనీరింగ్ విద్య పూర్తి చేసిన వారిలో ప్రతి 100 మందిలో 60 మందికి స్కిల్స్ లేవని కంపెనీలు తిరస్కరిస్తున్నాయి. ఆ జాబితాలో మీరు లేకుండా చూసుకోవాలి. తల్లిదండ్రులు మార్గదర్శనం చేయాలి తప్ప నిర్దేశం కాదు. ఇష్టమైన కోర్సులో పిల్లలను చేరనీయాలి. అందులో రాణించేలా ప్రోత్సాహం ఇవ్వాలి.




జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపిక

విద్యార్థిని అభినందించిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్




విశ్వత్‌ను సన్మానిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో జరగనున్న 54వ జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు జిల్లాకు చెందిన కేంద్రీ య విద్యాలయ విద్యార్థి తాటి విశ్వత్ ఎంపికయ్యాడు. హైదరాబాద్ హకీంపేట ఎయిర్ ఫోర్స్ అకాడమీ కేంద్రీయ విద్యాలయంలో ఈ నెల 16, 17 తేదీల్లో నిర్వహించిన 54వ రీజనల్ స్కేటింగ్ పోటీల్లో విశేష ప్రతిభ చాటిన విశ్వత్ మూడు విభాగాల్లో పాల్గొని ఒక బంగారు, రెండు రజత పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జాతీయ పోటీలకు ఎంపికైన విశ్వత్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అభినందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విశ్వత్ ముున్ముందు జరిగే జాతీయ పోటీల్లో విశేష ప్రతిభచాటి రాష్ట్ర క్రీడా పతాకాన్ని ఎగురవేయాలని అన్నారు. విశ్వత్ గెలుపొందినందుకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఫోన్ ద్వారా ఆశీస్సులు అందించారు. ఈ కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ పంకజ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ వామన్‌రావు, పీఈటీ వివేక్, స్కేటింగ్ కోచ్ గట్టు అనిల్ కుమార్‌గౌడ్, హరి పాల్గొన్నారు.



మానవ శరీరంలో కీలకం

నేడు ప్రపంచ కాలేయ దినోత్సవం



సుభాష్‌నగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మానవ శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవం కాలేయం. కాలేయం జీవక్రియ, జీర్ణక్రియ, రోగ నిరోధక శక్తి, విష పదార్థాల వడపోత, విటమిటన్లు, ఖనిజాలు, గ్లూకోజు నిల్వ వంటి అనేక విధులను నిర్వహిస్తుంది. కాలేయం స్వీయ స్వస్థత ప్రత్యేక లక్షణాన్ని కలిగి ఉంటుంది. ప్రపంచ వ్యాప్తంగా సంవత్సరానికి 20 లక్షల మంది కాలేయ వ్యాధుల వల్ల మరణిస్తున్నారు. మద్యం సేవించే వారిలో 7.5 శాతం నుంచి 10 శాతం మంది కాలేయ సంబంధిత వ్యాధులకు గురయ్యే అవకాశం ఉంది. ఊబకా యులు, మధుమేహ వ్యాధిగ్రస్తులు కూడా ఈ వ్యాధుల బారిన పడే అవ కాశం ఉంది. ఏటా కొత్త కేసుల్లో 35శాతం పెరుగుదల ఉంటుందని వైద్య నిపుణులు అంటున్నారు.

● అవగాహన లేక పోవడంతో....

వ్యాధి తీవ్రత సంబంధిత ప్రమాద కారకాలు, నివారణ గురించి ప్రజల్లో అవగాహన లేక పోవడంతో వ్యాధి బాధితులు పెరుగుతున్నారు. ప్రొటీన్, ఫైబర్ అధికంగా ఉండే సమతుల్య ఆహారాన్ని తీసుకుంటూ క్రమం తప్పకుండా వ్యాయామం, ధ్యానం చేస్తే కాలేయ వ్యాధులు రాకుండా జాగ్రత్త పడవచ్చు. మద్యం, ధూమపానం పూర్తిగా మానుకోవాలి.

● జంక్ ఫుడ్‌తో చాలా ప్రమాదం... డాక్టర్ ప్రణీత్, మెడికవర్ హాస్పిటల్ కరీంనగర్



గతంలో మద్యపానం చేసేవారికి మాత్రమే కాలేయం చెడిపోయేది. మారుతున్న జీవనశైలితో ప్రస్తుతం జంక్‌ఫుడ్‌తో ఫ్యాటీ లీవర్ ఎక్కువగా వస్తుంది. మారిన జీవన శైలి, ఆహారపు అలవాట్లు, వ్యాయామం లేకపోవడం, కలుషిత నీరు, ఆహారంతో హెపటైటీస్ ఏ అనే వైరస్ వస్తుంది. దీంతో పచ్చ కామెర్లు వంటివి వస్తున్నాయి. డ్రగ్ అడిక్షన్, ఇతరులకు వాడిన నిడిల్‌తో హెపటైటీస్ బీ, సీ వస్తాయి. పాశ్చాత్య పోకడల వల్ల నేటి యువత జంక్ ఫుడ్‌కు అలవాటు పడిపోతున్నారు. దీంతో 60లో రావలసిన వ్యాధులు 30లో వస్తున్నాయి.

● ఈ సంవత్సర థీమ్...

ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏప్రిల్ 19న కాలేయ దినోత్సవం నిర్వహిస్తోంది. ఈ సంవత్సరం థీమ్ 'ఆహారమే ఔషధం'. ఈ థీమ్ సమతుల్య ఆహారం ద్వారా కాలేయ వ్యాధులను నివారించడంలో పోషకాహారం కీలక పాత్రను చెబుతోంది.

తప్పుడు దస్తావేజులు సమర్పించిన వారిపై క్రిమినల్ కేసు

పెద్దపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తప్పుడు దస్తావేజులు సమర్పించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని పెద్దపల్లి తహసీల్దార్ డీ రాజయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి భూంనగర్‌లోని సర్వే నంబర్ 694లో ఉన్న 309చదరపు గజాల భూమి ఠాకూర్ శంకర్ సింగ్ 2009లో కొనుగోలు చేశారు. ఆయన మరణం తర్వాత కూతురు ఠాకూర్ మధుమిత, తల్లి ఠాకూర్ శ్యామల తాము మాత్రమే హక్కుదారులమని తప్పుడు పత్రాలు చూపించి, కుమారుడు ఠాకూర్ అభిలాష్ ఉన్నట్లు మార్చి రిలిజ్ రైట్స్ డీడ్ పొందారని తెలిపారు. ఠాకూర్ అభిలాష్ సైతం అప్పటి కొత్తపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి కిషోర్ బాబుతో కుమ్మక్కై అతని తల్లి శ్యామల చనిపోయినట్లుగా తప్పుడు డెత్ సర్టిఫికెట్‌ను సృష్టించి సదరు భూమిని ఠాకూర్ సాయి సంతోష్‌కు పెద్దపల్లి సబ్ రిజిస్టర్‌ను తప్పుదోవ పట్టిస్తూ విక్రయించారని అన్నారు. ప్రభుత్వ అధికారు లను తప్పుదోవ పట్టించినందుకుగాను ఠాకూర్ శంకర్ సింగ్ కుమార్తె ఠాకూర్ మధుమిత ఏ1, భార్య ఠాకూర్ శ్యామల ఏ2, కుమా రుడు ఠాకూర్ అభిలాష్ ఏ3, ఠాకూర్ సాయి సంతోష్ ఏ4, ప్రస్తుతం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో గ్రామపంచాయతీ కార్యదర్శి గా పనిచేస్తున్న కిషోర్ బాబు ఏ5గా పోలీసులు ఐపీసీ 420, 409, 464, 467 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారని పెద్దపల్లి తహసీల్దార్ పేర్కొన్నారు.

అదుపు తప్పి కారు బోల్తా

ముగ్గురికి గాయాలు

కొడిమ్యాల, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలోని చెప్యాల క్రాస్ రోడ్డు నుంచి దొంగలమర్రి బస్ స్టేజీ వైపు వెళ్తున్న కారు శుక్రవారం అదుపు తప్పి పక్కన ఉన్న కందకంలో బోల్తా పడింది. హైదరాబాదు నుంచి కారులో సుమారు పది మందితో వేములవాడ రాజరాజేశ్వర స్వామి దర్శనం చేసుకొని కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వెళ్తుండగా కారు అదుపు తప్పి బోల్తా పడినట్లు తెలిసింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలైనట్లు తెలిసింది. గాయాల పాలైన వారిని చికిత్స నిమ్మిత్తం జగిత్యాల ఆసుపత్రికి 108 వాహనంలో సిబ్బంది తరలించారు. ఈ విషయమై కొడిమ్యాల ఎస్సై సందీప్‌ను వివరణ కోరగా ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

యువకుడి ఆత్మహత్య

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామానికి చెందిన ఆరెల్లి అజయ్ (22) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అజయ్ తల్లి పద్మ కొన్ని రోజులుగా కాన్సర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతోంది. దీంతో మనస్తాపం చెందిన అజయ్ గురువారం తన వ్యవసాయ భూమి వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోగా గమనించిన తండ్రి వెంకటి స్థానికుల సహాయంతో చికిత్స నిమిత్తం కోరుట్లకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం జగిత్యాల తరలించినట్లు తెలిపారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు తెలిపారు. అజయ్ తండ్రి వెంకటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏటీఎంలలో చోరీకి పాల్పడుతున్న వ్యక్తుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పెద్దపల్లి డీసీపీ కరుణాకర్

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడి ఏటీఎంల్లో దోపిడీకి పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను పెద్దపల్లి పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఏసీపీ కార్యాలయంలో డీసీపీ కరుణాకర్ వెల్లడించారు. రాజస్థాన్ రాష్ట్రం అల్వార్ జిల్లాకు చెందిన అన్నదమ్ములు సిద్ధిక్‌ఖాన్, ఆరీఫ్‌ఖాన్ మరో నలుగురు ఆరీఫ్‌గుటారి, అష్ మహ్మద్, సాహిల్, ఇమ్రాన్ ముఠాగా ఏర్పడి ఏటీఎంల వద్ద దోడిడీకి పాల్పడ్డారు. మధ్యప్రదేశ్, మహారాష్ట్రల్లో ఏటీఎంలో దోపిడీకి పాల్పడి వాటాలు పంచకుంటుండగా వివాదాలు తలెత్తి విడిపోయారు. సిద్ధిక్‌ఖాన్, ఆరీఫ్‌ఖాన్ మాత్రం తెలంగాణకు చేరుకొని వివిధ ప్రాంతాల్లో దోపిడీకి పాల్పడ్డారు.

ఈ నెల 15న ఉదయం పెద్దపల్లిలోని కునారం రోడ్డులోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎమ్ వద్ద దోచుకునేందుకు సిద్ధమయ్యారు. అనుకున్న ప్రకారం వెంట తెచ్చుకున్న ఓ పరికరాన్ని ఏటీఎంలో అమర్చి ప్లాస్టర్ వేసి ఉంచారు. పట్టణంలోని శాంతి నగర్‌కు చెందిన పుట్ట శివకుమార్ ఐదు వందల రూపాయలు డ్రా చేసేందుకు ఏటీఎమ్ ఆపరేట్ చేశాడు. మిషన్ నుంచి డబ్బులు బయటకు రాకపోవడంతో డబ్బులు లేవనుకొని వెళ్లిపోయాడు. వెంటనే సిద్ధిఖ్, ఆరీఫ్‌లు ఏటీఎమ్‌లో అమర్చిన టీ ఆకారపు పరికరాన్ని తొలగించి ఐదు వందలు తీసుకున్నారు. శివకుమార్ బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు కట్ అయ్యాయి. ముంబాయి సెక్యూరిటీ విభాగం నుంచి పెద్దపల్లి బ్రాంచీకి ఏటీఎమ్ తెరిచిన సమాచారాన్ని అందించారు. బ్యాంకు సిబ్బంది చుట్టపక్కల వెతికే సరికి ఎవరు లేక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పెద్దపల్లిలో ఎస్‌బీఐ ఏటీఎంల్లో అమర్చిన పెట్రో కంపెనీ మిషన్లను వెతికారు. లేకపోవడంతో కాగజ్‌నగర్ వెళ్లేందుకు రైల్వే స్టేషన్ వచ్చారు. పోలీసులు సీసీ కెమరాల ఫుటేజీల ఆధారంగా రైల్వేస్టేషన్‌లో నిందితులను పట్టుకున్నారు. అయితే ఇలా అన్ని ప్రాంతాల్లో పెట్రో కంపెనీ ఏటీఎమ్‌లను టార్గెట్ చేస్తూ వెంట తెచ్చుకున్న పరికరాలతో డబ్బులు తీసుకుంటున్నారని తెలిపారు. ఇంకా పెద్ద ఎత్తున నగదు నష్ట పోకుండా అరికట్టిన సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు లక్ష్మణ్‌రావు, మల్లేష్ సిబ్బందిని అభినందించి రివార్డులు అందజేశారు. నిందితుల నుంచి టీ పరికరం ప్లాస్టర్లు, రేకు ముక్కలు, కట్టర్, రెండు సెల్ ఫోన్లు, ఐదు వందల నోట్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరుచనున్నట్లు డీసీపీ తెలిపారు. ఆయన వెంట ఏసీపీ గజ్జి కృష్ణ ఉన్నారు.

జాతీయస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): హ్యాండ్‌బాల్ అసోసియేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో జరిగిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఉమ్మడి జిల్లాకు చెందిన జైనపురం నాగరాజు, కల్లెపల్లి చక్రధర్‌లు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వడ్లూరి రాజేందర్, జిట్టబోయిన శ్రీను తెలిపారు. వీరు ఈ నెల 19 నుంచి 23 వరకు బీహార్ రాష్ట్రంలో జరిగే 47వ జాతీయస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ తెలంగాణ చైర్మన్ జగన్మోహన్‌రావు, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రంజిత్ రెడ్డి, విష్ణువర్ధన్ తెలిపారు. వీరిని మాజీ ఎంపీపీ పొనుగోటి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ బొమ్మరవేని తిరుమల తిరుపతి, ట్రెజరర్ కలిగేటి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి జెట్టిపల్లి అశోక్, సభ్యులు అనూప్ రెడ్డి, ఇతరవేని శ్రీనివాస్, భాస్కర్, రాజ్ కుమార్, మహేష్, లింగారావు అభినందించారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం



ఆలయ ఆవరణలో భక్తులు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయం శుక్రవారం భక్తజన సంద్రంగా మారింది. విద్యార్థులకు సెలవు రోజులు కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు రాజన్న దర్శనానికి పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా భక్తులు కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకుని ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించారు. ధర్మదర్శనం, కోడె మొక్కు క్యూలైన్‌లో సుమారు రెండు గంటలపాటు బారులు తీరిన భక్తులు స్వామివారలను దర్శించుకున్నారు. రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఈవోలు, సూపరిండెంట్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

హైందవ భక్తికళా సమ్మేళనం విజయవంతం చేయాలి..

హౌదవ భక్తి కళా సమ్మేళనం నిర్వహించే సభను విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు ప్రతాప రామకృష్ణ పిలుపునిచ్చారు. వేములవాడ రాజన్న ఆలయ ఆవరణలో విజయశంకర్ స్వామితో కలిసి శుక్రవారం హైందవ భక్తి కళా సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ మే 7వ తేదిన హైదరాబాద్‌లోని ఇందిరా పార్కులో నిర్వహించే సభకు పెద్ద ఎత్తున హిందువులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

నల్లగొండలో 22న వేలం

కొడిమ్యాల, ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లగొండ గ్రామ శివారులో ఎత్తైన గుట్టపై ఉన్న శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ పరిధిలో కిరాణం దుకాణం నిర్వహించుకొను హక్కు పొందుటకు, తల నీలాలు, పుట్టు వెంట్రుకలు పోగు చేసు కొను హక్కు పొందుటకు ఈనెల 22న ఉదయం 11గంటల 30 నిమిషాలకు ఆలయ కార్యాలయంలో బహిరంగ వేలం పాట, సీల్ టెండర్ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ఉడుతల వెంకన్న శుక్రవారం తెలిపారు. ఈవో విలేకరులతో మాట్లా డుతూ కిరాణం దుకాణం నిర్వహించు కొనుటకు, తలనీలాలు, పుట్టు వెంట్రుకలు పోగు చేసుకోవటానికి 3లక్షల రూపాయలు డిపాజిట్ చెల్లించాలన్నారు. ఆసక్తి గల వారు పాల్గొనాలని ఈవో కోరారు.

'విఠల్‌శెట్టి మృతి తీరని లోటు'

జగిత్యాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సుమారు గత నాలుగు దశాబ్దాలుగా ఉడిపి హోటల్ వ్యాపారం నిర్వహిస్తున్న విఠల్‌శెట్టి మృతి చెందడం తీరని లోటని జగిత్యాల కళాశ్రీ అధినేత గుండేటి రాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విఠల్ శెట్టి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి

-జిల్లా కారోబార్ల సంఘం డిమాండ్

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం తీసుకువచ్చిన మల్టీపర్పస్ విధానంను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని జిల్లా కారోబార్‌ల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు గంగమల్లయ్య, ఆకుల కిరణ్ రెడ్డిలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ కేటగిరీలో పని చేస్తున్న వారిని అదే కేటగిరిలో కొనసాగించాలన్నారు. రఘునాథపల్లి మండలం మేకలగుట్ట గ్రామ కారోబార్ నాగరాజు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వీధిలో ఉన్న స్తంభాలకు బల్బ్ ఏర్పాటు చేసే క్రమంలో షాక్‌తో మృతిచెందడం విచారకరం అన్నారు. వారి వెంట జిల్లా నాయకులు పోతు సురేష్, ఉరమండ్ల శ్రీకాంత్, భరణి, గంగాధర్, మల్లేశం, రాములు, రాకేష్, సుధాకర్, అనిల్, గంగారెడ్డి, రమేష్, అజీజ్, తదితరులున్నారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞలు తెలిపిన విశ్వకర్మ సంఘం నాయకులు

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): విశ్వకర్మలను గుర్తించి 25 హెచ్‌పి వరకు కరెంటు కెపాసిటి గల విద్యుత్ వాడుకునే విధంగా రూప కల్పన చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జగిత్యాల జిల్లా విశ్వకర్మ సంఘం నాయకులు కృతజజతలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను కలిసి విశ్వ కర్మ అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్తు జిల్లా అధ్యక్షులు చింతల రాజేశ్వర్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్‌వోసీ అందజేత

జగిత్యాల పట్టణంలోని 34వ వార్డుకుచెందిన చిట్ల మల్లీశ్వరి కంటికి సంబంధించి చికిత్స జరగగా ఆమేకు 40 వేల విలువగల ఎల్‌ఓసిని డాక్టర్ సంజయ్ కుమార్ అందజేశారు.

వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలి





జగిత్యాలలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ముస్లింలు, మెట్‌పల్లి పట్టణంలో ర్యాలీ

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని శుక్రవారం జిల్లా కేంద్రంలో ముస్లింలు ఆందోళన చేశారు. ప్రార్థన అనంతరం కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీలు, ప్లకార్డులతో శాంతియుత నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం వక్ఫ్ ఆస్తులను దేశంలోని అన్ని మతాలకు, కులాలకు సమానంగా పంచాలని ముస్లింమేతరులకు కూడా సమాన హక్కులు కల్పిస్తూ, పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టడం సరైంది కాదన్నారు. దేశంలోనే ముస్లింలు మైనార్టీలుగా కొనసాగుతున్నారని, దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్నారన్నారు. వారి ఆస్తులపై వారికే హక్కులు కలిగించేలా మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తీసుకోవాలని, ఇది వరకు ప్రవేశ పెట్టిన బిల్లును తక్షణమే రద్దుచేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ముస్లింలు పాల్గొన్నారు.

●కోరుట్ల: వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ శుక్రవారం పట్టణంలోని వివిధ మసీదుల వద్ద ముస్లింలు నిరసన ప్రదర్శనను నిర్వహించారు. మధ్యాహ్నం ప్రార్థన సమయంలో మసీదుల సమీపంలో ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ముస్లింలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పలువురు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

●మెట్‌పల్లిటౌన్: వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం మెట్‌పల్లి డివిజన్‌కు చెందిన ముస్లిం నాయకులు పట్టణంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పాత బస్టాండ్ మజీద్ నుండి ఆర్డీఓ కార్యాలయం వరకు మౌనం పాటిస్తూ శాంతియుత ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చట్టానికి విరుద్ధంగా ముస్లిం లాలో జోక్యం చేసుకొని వక్ఫ్ బోర్డులో నాన్ ముస్లింలను చేర్చడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను హరించడానికి, ముస్లింల మనోభావాలు దెబ్బతీసే విధంగా వక్ఫ్ సవరణ బిల్లు తెచ్చిందన్నారు. దేశ ప్రయోజనాలు దెబ్బతీసే విధంగా ప్రవర్తిస్తున్న వీరి వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ ప్రొటెక్షన్ బిల్లు 2025ని వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లీం నాయకులు తమీజు, మహమ్మద్ అజీం, సోహెల్, ఘనీ, అఖిల్, వసీం, నయీంద్దీన్, రాయిసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'యువత సేవాభావాన్ని అలవర్చుకోవాలి'

రాయికల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): యువత సేవాభావాన్ని అలవర్చుకోవాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. రాయికల్ పట్టణంలోని చిన్న జీయర్‌స్వామి ట్రస్ట్ భవనాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ప్రతిమ ఫౌండేషన్ సహకారంతో, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ హౌజ్ వైరింగ్, హోమ్ ఎయిడ్ హెల్త్, టైలరింగ్ కోర్సుల్లో ఉచిత ఉపాధి శిక్షణ పొందుతున్న నిరుద్యోగ యువతీ, యువకులతో ముచ్చటించారు. శిక్షణ పొందుతున్న కోర్సుల్లో వృత్తి నైపుణ్యాలు నేర్చుకుంటూ యువత సేవాభావాన్ని అలవర్చుకుంటే ప్రగతిపథంలో దూసుకు వెళ్లి అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబడతారని అన్నారు. శిక్షణ కేంద్రంలో నీటి సమస్యను గురించి సిబ్బంది తెలుపగా వెంటనే బోర్‌వెల్‌ను మంజూరు చేశారు. ప్రధాన ద్వారం వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలతాజా మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, జిల్లా స్కిల్ కమిటీ సభ్యులు, ప్రతిమ ఫౌండేషన్ ఆర్గనైజర్ నాగిరెడ్డి రఘుపతి, నాయకులు కోల శ్రీనివాస్, డాక్టర్ మహేందర్ బాబు, మాజీ సర్పంచ్ డాక్టర్ రాజరెడ్డి, జీఎంఆర్ సిబ్బంది ప్రమోద్, నాగేందర్, చిరంజీవి, వనిత, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పేద వెలమ కులస్థులకు ఆర్థిక భరోసా

- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్



చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నిరుపేద వెలమ కులస్థులకు సంఘం ఆర్థిక భరోసానిస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పద్మనాయక ఫంక్షన్ హాలులో సంఘం ఆధ్వర్యంలో సేకరించిన రూ.4 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాన్ని ఇటీవల మృతిచెందిన గండ్ర వంశీధర్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. వీటితో పాటు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ రూ.25 వేలు, సంఘ సభ్యులు డాక్టర్ వేణు రూ.25 వేలు, రమణారావు రూ.10 వేలు, అల్లీపూర్ పద్మనాయక సంఘం నుంచి రూ.34 వేలు, నాచుపల్లి పద్మనాయక సంఘం నుంచి రూ.31 వేలు నగదును బాధిత కుటుంబసభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడారు. నిరుపేద సంఘ సభ్యులకు పద్మనాయక సంఘం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అయిల్నేని సాగర్‌రావు, ప్రధాన కార్యదర్శి దన్నపునేని వేణుగోపాల్‌రావు, కోశాధికారి కృష్ణారావు, సలహా మండలి సభ్యులు పురుషోత్తం రావు, రమణారావు, దామోదర్ రావు, నాయకులు కమలాకర్, రవీందర్, ప్రశాంత్, ప్రవీణ్, అజయ్, అనిల్, సురేందర్, రాంప్రసాద్, మహిళా సభ్యులు సరళ, హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ధర్మకర్తల నియామకం

కోరుట్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర దేవాయల నూతన ధర్మకర్తల మండలి సభ్యులను శుక్రవారం రాష్ట్ర దేవాలయ శాఖ కమీషనర్ శ్రీధర్ ప్రకటించారు. దేవాలయ ధర్మకర్తల మండల సభ్యులుగా ఎతిరాజం నర్సయ్య, నేతి శ్రీనివాస్, కటకం దివాకర్, కొంత గంగాధర్, గోడికె రాములు, చిలివేరి విజయకుమార్, చిట్యాల పద్మలను ప్రకటించారు. నూతనంగా ఎంపికయిన కమిటి ఈ నెల 19 తేదీన ప్రమాణ స్వీకారం చేయ్యనున్నట్లు దేవాలయ ఈఓ విక్రం తెలిపారు.

సన్మానం

మెట్‌పల్లిటౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి బార్ అసోసియేషన్ మహిళ ప్రతినిధిగా ఇటీవల ఆకుల మానస ఎన్నిక కాగ శుక్రవారం పట్టణంలో అమెను ప్రసన్న హరికృష్ణ అభినందించి శాలువతో సత్కారించారు. మహిళల సంక్షేమం కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాసిన్, లింగంపల్లి సంజీవ్, ఆకుల ప్రవీణ్, గంగాధర్, ప్రవీణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ధర్మపురి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని జైనా గ్రామంలో ధర్మపురి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుంట సుధాకర్ లబ్దిదారులకు రూ 4,30,500 సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని నిరుపేద ప్రజలకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థికసాయం మంజూరు చేయించి నట్లు తెలిపారు. కొసునూర్‌పల్లె పంచాయితీ పరిధిలో గల నాయకపుగూడెం నీటి ఎద్దడి దృష్ట్యా ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ బోర్‌వెల్ మంజూరు చేయించారు.

డీలర్ల భర్తీకి మోక్షమెప్పుడో..?

(5వ పేజీ తరువాయి)

సరుకుల పంపిణీలో జాప్యం జరుగుతోంది. రెండు ప్రాంతాల్లో సరుకులు పంపిణీ చేయడం ఇన్‌చార్జీలకు సైతం ఇబ్బందికరంగా తయారైంది.

● కొత్త రేషన్ దుకాణాల జాడేది..?

జిల్లాలో కొత్తగా రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయడం లేదు. నిబంధనల ప్రకారం 500 నుంచి 600 రేషన్ కార్డులకు ఒక రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలి. ఈ లెక్కన జిల్లాలో మరో పాతిక వరకు రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం 500 జనాభా దాటిన తండాలు, గ్రామాలను పంచాయతీలుగా అప్ గ్రేడ్ చేసింది. దీంతో జిల్లాలో కొత్తగా 53 గ్రామ పంచాయతీలు ఏర్పాటు అయ్యాయి. కొత్తగా ఏర్పాటు అయిన పంచాయతీల్లో రేషన్ దుకాణాలు లేకపోవడంతో పల్లె వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇతర గ్రామాలకు వెళ్లి రేషన్ సరుకులను తీసుకొచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పలువురు కొత్తగా రేషన్ దుకాణాల మంజూరు కోసం ప్రజాప్రతినిధులకు దరఖాస్తులు సమర్పించుకున్నప్పటికీ మోక్షం లభించడం లేదు.

కొత్త రేషన్ దుకాణాలు మంజూరు చేయాలి

-నందయ్య, జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు



జిల్లాలో అవసరమైన ప్రాంతాల్లో కొత్త రేషన్ దుకాణాలు మంజూరు చేయాలి. దూర ప్రాంతాలకు వెళ్లి సరుకులు తెచ్చుకోవడం వల్ల ఆహార భద్రతా కార్డుదారులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల స్థానాలను సైతం భర్తీ చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించాలి.

రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు

-కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



ధాన్యం తేమను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

మల్లాపూర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వెంటనే ధాన్యం తూకం వేయాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల నిర్వాహకులకు సంజయ్ సూచించారు. మండలంలోని కుస్థాపూర్, రత్నాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం వరంగల్‌లో నిర్వహించే వజ్రోత్సవ సభకు తరలిరావాలని కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి ఇచ్చి మద్దతు ధర కల్పించి రాజు చేసిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

-మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

సారంగాపూర్, ఎప్రిల్, 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డిలతో పాటు నిర్మలా సీతారామన్‌కు లేఖ రాస్తానని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీదేవిపల్లి అటవీ ప్రాంతంలో పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్ళి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మసర్తి రమేష్, పీఏసీఎస్ చైర్మన్ నవీన్‌రావు, మాజీ జడ్పీటీసీ ముక్క శంకర్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

బీర్‌పూర్,ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి):బీర్‌పూర్ మండలంలోని రేకులపెల్లి గ్రామంలో గల రేణుక ఎల్లమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా శుక్రవారం మాజీ మంత్రి జీవన్‌రెడ్డి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మసర్తి రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుభాష్ యాదవ్, కొల్వాయి సింగిల్‌విండో చైర్మన్ నవీన్ రావ్, సారంగాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాంచంద్రరెడ్డి, మాజీ సర్పంచ్ జింతేందర్ యాదవ్, మాజీ జడ్పిటీసీ ముక్క శంకర్, నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్ పాలకవర్గం రైతు సంక్షేమానికి కృషి చేయాలి

-ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



పెగడపల్లిలో మార్కెట్ కమిటీ పాలక వర్గాన్ని సత్కరిస్తున్న విప్ అడ్లూరి

పెగడపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం రైతులకు అందుబాటులో ఉంటూ రైతాంగ సంక్షేమానికి దోహదపడాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. పెగడపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బుర్ర రాములు గౌడ్, ఉపాధ్యక్షులుగా సురకంటి సత్తిరెడ్డిలతో పాటు డైరెక్టర్ల నియామకం జరుగగా శుక్రవారం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరై నూతన కమిటీని సత్కరించారు. ఈ సందర్భంగా పాలకవర్గాన్ని ఉద్దేశించి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ పాలకవర్గాలు రైతులకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ రైతులు పండించిన పంటల విక్రయాలలో ఇబ్బందులకు గురి కాకుండా చూడటంతో పాటు, ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశ పెడుతున్న పథకాలను అర్హులైన రైతులకు అందేలా చూసే బాధ్యత మార్కెట్ పాలకవర్గానిదేనన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ. 2 లక్షలు పంట రుణాలను మాఫీ చేయడంతో పాటు , సన్న వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ అందిస్తూ రైతు సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చొప్పదండి మాజీ శాసనసభ్యుడు కోడూరి సత్యనారాయణ గౌడ్, తహసీల్దార్ బి.రవీందర్, ఎంపీడీవో ఎ. శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీలు కాసుగంటి రాజేందర్ రావు, తాటిపర్తి శోభారాణి, తోట మోహన్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ ఒరుగల శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ కర్ర భాస్కర్ రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు ముదుగంటి విష్ణువర్దన్ రెడ్డి, విజయలక్ష్మి, సత్యప్రసన్న, మండల నాయకులు, డైరక్టర్లు, నియోజకవర్గ నాయకులు, మార్కెటింగ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'సమాజ సేవ హర్షణీయం'

ధర్మపురి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మంథని సీతా రామ సేవా సదన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని బ్రాహ్మణ సంఘంలో ప్రజల సౌకర్యార్థం మంథని సీతారామ సేవా సదన్ సౌజన్యంతో నూతనంగా ఏర్పాటు చేసిన అంబులెన్స్ సర్వీస్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ బ్రాహ్మణ సంఘం, అన్నపూర్ణ సేవా సమితి, గాయత్రి నిత్యాన్న సత్ర సంఘం నిర్వహణలో అంబులెన్స్ సేవలు అందించడం తనకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. చింతామణి చెరువులో నీరు నింపాలని కోరుతూ బండి మహేష్ ఆధ్వర్యంలో యువకులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ రవీందర్, టీపీసీసీ సభ్యులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు దినేష్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

'రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యం'



సంగెంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జు జువ్వాడి నర్సింగ రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, జై సంవిదాన్ కోర్డినేటర్ కత్తి వెంకట స్వామిలు అన్నారు. శుక్రవారం మండలంలోని మోహన్‌రావుపేట గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, సంగెం గ్రామంలో కత్తి వెంకటస్వామి, జువ్వాడి నర్సింగ రావు ఆధ్వర్యాలలో జై బాపు... జై భీమ్... జై సంవిదాన్ కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమాలలో మార్కెట్ కమిటి చైర్మెన్ పన్నాల అంజిరెడ్డి నాయకులు కొంతం రాజం, గడ్డం వెంకటేష్, పెరుమాండ్ల సత్యనారాయణ, నాయిని సురేష్, శ్రీగద్దె నరహరి, పోతుగంటి శంకర్, మంతెన నర్సయ్య, ముక్కెర లింబాద్రి, బోల్లి నర్సయ్య, పోతుగంటి వెంకాగౌడ్, పరుస తుక్కారం, నవీన్ రెడ్డి, ముంజ రాజగౌడ్, జక్కుల రాజం, రామచంద్ర రావులు పాల్గొన్నారు.

●కోరుట్ల: పట్టణంలోని 7, 8, 9 వార్డులలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు... జై భీమ్... జై సంవిదాన్ ర్యాలీలను నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రా పటాలను ప్రదర్శిస్తూ ర్యాలీలను నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తిరుమల గంగాధర్, పుప్పాల ప్రభాకర్, ఆడెపు మధు, అన్నం అనిల్‌లతో పాటు నాయకులు పాల్గొన్నారు.

●మల్లాపూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని అమలు పరచడంలో అంబేద్కర్ స్ఫూర్తికి పూర్తి విరుద్ధంగా ప్రవర్తిస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. శుక్రవారం మండలంలోని గొర్రెపల్లి, వెంకట్రావుపేట, వేంపల్లి, రేగుంట గ్రామాల్లో పీసీసీ కోఆర్డినేటర్ సత్యంగౌడ్‌తో కలిసి జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రయంలో భాగంగా నిర్వహించిన పాద్రయాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జవహర్‌లాల్ నెహ్రూ నుండి నేటి వరకు కాంగ్రెస్ పార్టీ భారత రాజ్యాంగంకు కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్‌రెడ్డి, అంతడపుల పుష్పలత, నర్సయ్య, జలపతిరెడ్డి, రాజోజి సదానందచారి, కోటగిరి ఆనంద్‌గౌడ్, నాగరాజు పాల్గొన్నారు.

●కథలాపూర్: మండలంలోని కలికోటలో శుక్రవారం కాంగ్రెస్ శ్రేణులు రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. వాడవాడలా జైబాపు, జైభీం, జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని నినాదాలు చేశారు. బీజేపీ కుల, మతాల పేరిట దేశంలో చిచ్చుపెట్టి మనువాదాన్ని అంటగట్టాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రాజ్యాంగాన్ని పరిహాసం చేసేలా వ్యవహరిస్తున్నందు వల్ల ఏకతాటిపై రాజ్యాంగం కల్పించిన హక్కులతో పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, వైస్ చైర్మన్ పులి శిరీషహరిప్రసాద్, రాష్ట్ర ఫిషర్‌మెన్ విభాగం అధ్యక్షుడు కల్లెడ గంగాధర్, జిల్లా కార్యదర్శి గోపిడి ధనుంజయ్‌రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాధాకృష్ణ పాల్గొన్నారు.

నరసింహుడి సన్నిధిలో ప్రత్యేక పూజలు

ధర్మపురి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని స్టేట్ ఫైనాన్స్ కంట్రోలర్ వెంకన్న శుక్రవారం సందర్శించారు. ఆలయం వద్ద ఆయనకు అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ ఆయనకు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం అందించి ఘనంగా సత్కరించారు. అంతకు ముందు ఆయన యమధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు.

ఆయన అనుబంధ ఆలయాల్లో స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అర్చకులు సీహెచ్ రమణయ్య, అర్చకులు చక్రపాణి కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ఎంఈవో సీతాలక్ష్మి, హెచ్ఎం పెండ్యాల మహేందర్, సిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహాలక్ష్మి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న అర్చకులు, భక్తులు

ధర్మపురి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో మహాలక్ష్మి రథోత్సవం శుక్రవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఉదయం వేళలో ఆలయ వంశ పారంపర్య అర్చకులు కొరిడె గుండయ్య శర్మ, నరహరి శర్మ, బాలకృష్ణ శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారలకు క్షీరాభిషేకం, కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు, అభిషేకాది కార్యక్రమాలు, హారతి, తీర్థ, ప్రసాద వితరణ నిర్వహించారు. భక్తులు అమ్మవారలను దర్శనం చేసుకున్నారు. సాయంత్రం వేళలో అమ్మవారల ఉత్సవ విగ్రహాన్ని అందంగా పూలతో అలంకరించిన రథంపై ఆసీనులు చేశారు. అనంతరం బోయవాడ, నంది విగ్రహ చౌరస్తా, దేవాలయం, బ్రాహ్మణ వీధి, గోదావరి దారి నది రోడ్డు మీదుగా ఊరేగింపు జరిపి రథోత్సవం నిర్వహించారు. దారి పొడవుగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అమ్మవారల జన్మదినం, వార్షికోత్సవం పురస్కరించుకుని ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం పక్షాన ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఈవో సంకటాల శ్రీనివాస్, వేదపండితులు, అర్చకులు ఏటా నిర్వహించే విధంగా ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

రాయికల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం రామాజీపేట, మూటపెల్లి, కొత్తపేట గ్రామాల్లో శుక్రవారం రిధాన్యం కొనుగోలు కేంద్రా లను ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు మల్లారెడ్డి మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాలను సద్విని యోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బేతి మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు భూమరాజం, నరేష్, పాల్గొన్నారు.

●ధర్మపురి: మండలంలోని దొంతాపూర్, మగ్గిడి-ఎడపల్లి, జైనా, తిమ్మాపూర్ గ్రామాల్లో జైనా, తిమ్మాపూర్ పీఏసీఎస్, ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ధర్మపురి ఏఎంసీ వైస్ చైర్మన్ సంగ నర్సింహులు, జైనా, తిమ్మాపూర్ పీఏసీఎస్ చైర్మన్లు సౌళ్ల నరేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

●మల్యాల: ముత్యంపేట, మానాల, బల్వంతాపూర్, సర్వాపూర్, మ్యాడంపల్లి, తక్కళ్లపల్లిలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మల్లీశ్వరీ శ్రీనివాస్‌గౌడ్, విండో చైర్మన్లు రాంలింగా రెడ్డి, చంద్రశేఖర్, సంత ప్రకాశ్‌రెడ్డి, జగదీశ్వర్, మ్యాక లక్ష్మన్, ఇంద్రసేనారెడ్డి, బండి రవి, బీపీ రమణ పాల్గొన్నారు.

●బీర్‌పూర్: బీర్‌పూర్ మండలంలోని తుంగూర్, చెర్లపెల్లి గ్రామాలలో శుక్రవారం బీర్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు ముప్పాల రాంచందర్ రావ్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

●కొడిమ్యాల: మండలంలోని తిప్పాయ్యపల్లి, అప్పారావుపేట గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను మల్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు జీవన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం కొడిమ్యాల, సండ్రల్లపల్లి, శనివారంపేట, దమ్మయ్యపేట గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాయణగౌడ్, సీనియర్ నాయకులు మహిపాల్‌రెడ్డి, పూడూర్ సింగిల్ విండో చైర్మన్ బండ రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.